# తెగిపోయిన స్వప్నం

వడ్లపట్ల దయానందం

తియ్య తియ్యని ఆలోచనలు మెల్ల మెల్లగా మెదడు నాక్రమించుకుని, హృదయాన్ని ఆనందంలో ముంచేసి ప్రక్కకి తప్పుకుంటున్నాయ్. ఒకదానికంటె ఒకటి మరింత మధురమై హృదయ తంత్రులని సున్నితంగా మీటి మృదు మధుర నాదాన్ని ఉదయింప జేస్తున్నది. చిగురులు మేసి మత్తెక్కి...వీనుల విందుగా కూసే కోయిల కూత కన్నా కమ్మని ధ్వనులను పలుకుతున్నాయ్ వలపు చిగురులను మేస్తున్న ఉషాదేవి హృదయ తంత్రులు.

లావణ్యం జాలువారుతున్న పలుచని సుందర వదనం, స్మితరేఖలను ఊరికే వెలువరిస్తున్నది. సన్నటి చిరునవ్వు, కెంజాయలతో కూడివున్న, ఇంపయిన పెదవులను గాఢంగా కౌగలించుకుని కనీ కనిపించని రెండు సొట్టలని రెండు బుగ్గలా ఏర్పరుస్తున్నది. పలుచని సిగ్గుతో భారమైన కనురెప్పలు అదనపు శోభను కూర్చి పెడుతున్నాయి. ముందుకుపడి ఉన్నవాల్జడ కుచ్చులు ... నిర్నిమిత్తంగానే ఆ కోమలి మృదు హస్తాల్లోపడి నలిగిపోతున్నాయ్.

"పిల్లా నీ పొగరణిగిందా!
పెళ్ళికి ముహూర్తం కుదిరిందా!"

చిట్టితమ్ముడు గభాల్న తలుపులు తోసుకుని గదిలోకి ప్రవేశిస్తూనే...చప్పట్లు కొడుతూ, ఎగిరి గంతులేస్తూ పాడుతున్నాడు.

చటుక్కున ఆలోచనల్నుంచి తేరుకున్న ఉష కుర్చీలోంచి లేచి వాడి వంక ఎంతో తియ్యగా చూసింది. ఆమెను మరింత ఏడ్పించడానికి, ఆవే చరణాలను పదేపదే ఆలాపిస్తున్నాడు.

"అక్కయ్యా...ఇక నీ అప్పచ్చులు తప్పి పోయాయ్‌లే నాకు...పెళ్లిచేసుకుని వెళ్లిపోతా వటగా...ఇక నాకు పాఠాలు చెప్పాల్సిన పనే ఉండదు ... చూడు ఇక బావతో చెప్పి నీకే అప్పచ్చులు తినిపిస్తా—"

విజయగర్వంతో ఎగిరి గంతులేశాడు.

ఉష గభాల్న బీరువా తలుపుతీసి...పావలా బిళ్ళ తీసి అమాంతం వాడిచేతిలో పెట్టేస్తూ... "ఛీ...పో...వెధవా—చాక్లెట్లు కొనుక్కుని ఏడువ్" అని కూకలేసింది.

"వెధవ .కొట్టేస్తావ్...అందులోనూ...అ...య...నతో"—మనసారా సిగ్గుపడి కసితీరా లోలోపలే ముద్దుగా తిట్టుకుంది బుజ్జిగాణ్ణి.

వాడికేం తెలుసు...అప్పుడే పెళ్ళయిపోయి నట్లే భావించుకుంటున్నాడు...ఇంతా అయితే పావుగంట క్రితం వాళ్లు చూచుకుని వెళ్ళారయ్యె. ముందు తను వాళ్ళకి నచ్చాలి. (తను నచ్చక పోవడమేమిట్లే) అటుపైన కట్నాలు లాంఛనాలు మొదలైన సవాలక్ష వ్యవహారాల్లో ఇద్దరిమధ్య ఏకాభిప్రాయం కుదరాలయ్యె. అతను మట్టుకు చక్కగా కుదురుగా ఉన్నాడు. చామన చాయే. అయినా తనలాగానే సిరిగల ముఖం. అంతా సంసారపక్షంగా ఉన్నాడు. థర్డు బి.ఏ. అట. ఐనా చదువుకునేవాళ్ళ వెకిలివేషాలేవీ లేవు. తను సైతం ఇంటరు చదివినా అందరూ అలానే అంటారుగా...చదువుకున్న పిల్ల లాగానే ఉండదని...స్నేహితురాళ్ళుసైతం తనని ఏడిపిస్తూ ఉండే వాళ్ళయ్యె. పల్లెటూరి పిల్లలా జడకుచ్చు లేసుకుని ఒంటి జడతో వెడితే. ఏమో బాబూ తనకిమట్టుకు వాళ్ళ వేషాలు అవీ చూస్తే పరమ అసహ్యమనిపించేది. సినిమా స్టార్స్‌లా నుదిటపక్క జుత్తు రావాలని రేపుకోవడం...కనిపించి పోతే ఎక్కడ ప్రమాదమో అన్నట్టు...కనీ కనిపించని చిన్న బొట్టు పెట్టుకోవడం...నగలు సైతం బరువై పోయినట్టు పట్టుకుంటే తెగిపోయే సన్నటి గొలుసు ఒక్కటే వేసుకోవడం...ఇక చోళీలు ... వాటి నెక్ షేపులు ... ఛీ ... తలుచుకుంటేనే తనకి పరమ అసహ్యం—పైవెచ్చ నలుగురు కూర్చొన్నప్పుడు కబుర్లు సైతం అవే... ఎవరి కెంతంతమంది ప్రియులున్నది ... ఎన్నెన్ని ప్రేమలేఖలు వ్రాసింది...ఏ కుర్రా డెటువంటివా

డైంది... ఎప్పుడూ అవే కబుర్లు. ఇక తనుమట్టుకు, అనుకుంటే ఆత్మస్తుతి అవుతుందేమో కాని... ఇటువంటి వెకిలివేషా లేవీ వేయనేలేదు. అందుకే తనకి స్నేహితురాళ్ళే "మైల్డ్‌ఫ్యానియల్" అనే బిరుదు కూడా ప్రదానం చేశారు.

ఏమిటో అనుకుంటాంగాని ... నడిస్తే తన పాదాలే ఎక్కడ కందిపోతాయో అన్నట్లు బహు నాజూకుగా ప్రవర్తిస్తుండే నళిని గతి ఏమైందే?... కాలేజీకి మధ్యాహ్నం టిఫెన్ పట్టుకొచ్చే చిన్నభరిణ తనే చేత్తో పట్టుకొని నడిస్తే ఎక్కడ నామర్దాయో అని ... పనికట్టుకుని రిక్షావాడిని వెయిటింగ్ రూమ్‌వరకూ దాదాపు అర మైలు నడిపించేది... ఇప్పుడేమయింది... పెళ్ళయి కాపురం చేసుకుంటూ... కుళ్ళాయినీళ్ళు అరమైలు దూరంనుంచి తనే చేరవేసుకుంటోంది.

ఇందిరమట్టుకు... లిప్‌స్టిక్ వేసుకుంటేనేగాని ఏమీ తోచదనేది... మొన్ననే పాపాయి నెత్తుకుని వచ్చింది... వాడు కాస్తా నవ్వుతూనే చీర పాడగొట్టాడు... నీళ్ళతో తుడుచుకుని వచ్చినట్టు ఆ చీరతోనే వెళ్ళలేదూ... మాటల సందర్భంలో చెప్పింది కూడాను ... పౌడరు పూసుకోవడం మానేసే దాదాపు సంవత్సరం కావస్తోందని. ఎటొచ్చీ లలిత పనే కాస్త మెరుగ్గా ఉంది... బాగా ఉన్నవాడే అదృష్ట వశాత్తూ దొరికాడు. మొన్నీమధ్య స్టేషన్‌లో కనిపించినప్పుడు అసలు ఆనవాలే కట్టలేకపోయింది తను. కళ్ళజోడు, రిస్టువాచీ హేండ్ బాగ్... సెకండ్‌క్లాస్ ట్రావెలింగు—చక్కగా భోగాలన్నీ అనుభవిస్తోంది. చదువుకునే రోజుల్లో ఎప్పుడూ జిడ్డు కారుతూండే ముఖంతో మందమతిగా ఉండేది... తనసెవరబ్బా, ఊఁ... శేఖర్ కామోసు... అతనితో సంబంధం ఉండేదని అందరూ చెప్పుకునేవాళ్లు. అట్లాంటిదాని కెంత అదృష్టం పడుతుందని ఎవరనుకున్నారు? ఎటొచ్చీ ఆ జట్టులోకల్లా ఇప్పటికీ అవివాహితగా మిగిలిపోయింది తనొక్కర్తే.

ముహూర్తం నిశ్చయం కావడంతోనే ముందు సుగుణకి ఉత్తరం వ్రాయాలి. ఎక్కడున్నా వచ్చి పెళ్ళికి పెత్తనం తనే చేస్తానంది. తనంటే అంత వాత్సల్యంతో ఉన్నదాన్ని నిర్లక్ష్యం చేస్తే మనసు నొచ్చుకోదూ. ఇక విమలసంగతి సరేసరి... తనకి కాబోయే అతన్ని అదేముందు సెలక్టు చెయ్యాలంది. ఏవో చదువుకునే రోజుల్లో నలుగురూ కూర్చుని సరదాకి అనుకున్న మాటలే కాని... పాపం దాన్ని తలచుకుంటేనే తనకి ఎక్కడలేని విచారమూను. ఆ మధ్యే ఇందిరకి ఉత్తరం వ్రాసిందట... ఐదు వందల రూపాయల జీతగాడన్న మాటేగాని... ఏముంది. రాష్ట్రంగాని రాష్ట్రమయ్యే... అందులోనూ మిలటరీ ఉద్యోగం ... ఇరవై నాలుగు గంటలూ తప్ప తాగే వుంటాడట... దాన్ని త్రాగమని నానాహింసలు పెడతాట్ట ... బాల్‌రూమ్ డాన్సింగ్‌కి రమ్మని బలవంతం చేస్తాట్ట... తెలియక పోయి ఉత్తమొద్దుని చేసుకున్నానని చీదరించుకుంటూ... రోజుకొక్క అమ్మాయితో గడిపేస్తూ ఉంటాడట... స్వతహాగా అది దృఢమనస్కురాలు కనుక సరిపోయిందిగాని... ఏ తనబోటిదో ఐతే ఏనాడో ఉరిపోసుకు చచ్చేదే.

అందుకే తనకసలు చదువుకు'న్నవాణ్ణి చేసుకోవాలని ఉండదు... ఏ పల్లెటూరి రైతాంగపు అతన్నో చేసుకోవాలని ఉంటుంది.

ఎదరింటి సుబ్బలక్ష్మి వాళ్ళఅన్న జానకిరామయ్య... పాపం తనంటే ప్రాణాలు విడుస్తాడు. అందని ఫలం వంక ఆశగా చూసినట్లు చూస్తూంటాడు తనవంక. తనక్కైతే ఉంటుంది. (ఊహూ భయమెందుకూ? ... మనసులో ఉన్న ఈ మాట తన మనసుకు తప్ప రెండోవాళ్ళకి తెలియదుగా) నాన్నా వాళ్ళు అంగీకరించరని కాని.

అతను పెద్దచదువులు కాని... చెప్పుకోదగ్గ ఆస్తి కాని ఉన్నది కనుకనా... ఉన్న ఐదెకరాలు కష్టపడి సేద్యం చేస్తూంటాడు... తండ్రికూడా లేడాయె... సుబ్బలక్ష్మి పెళ్ళి చేయాల్సిన భారం సైతం అతనిమీదేఉంది... పాపం... ఇరవై రెండు సంవత్సరాల వయస్సులోనే యాభై సంవత్సరాలు నిండిన అనుభవజ్ఞుడైన ముదుసలిలా ప్రవర్తించవలసి వచ్చింది... చెల్లెలంటే అతని కెంత ఆపేక్షో. ఉన్న ఐదెకరాలైనా ఇచ్చేసి మంచి సంబంధం చూడాలంటాడు ... నీ గతేమౌతుందంటే ... "భగవంతుడి దయవల్ల కాలూ చెయ్యీ తిన్నగా ఉంది... నా కింకేంబాధ ఎలాగైనా బ్రతగ్గలను" అంటాడు.

నీళ్ళలాంటి మజ్జిగతో గుప్పెడు మెతుకులతో భోజనం అయిందనిపించుకున్న పూటలు సైతం తనకి తెలుసు...పైపెచ్చు "తృప్తనేదానికి అంత మెక్కడం?...అనుకోగలగాలేగాని ఎక్కడికక్కడే తృప్తి" అంటూంటాడు.

ఇతనైనా బి. ఏ. అన్న మాటేగాని...అంతా సంసార పక్షంగానే ఉన్నాడు...తను నచ్చినట్లు అతని ముఖాన్నిబట్టి ఖచ్చితంగా తెలిసిపోయింది...ఎటొచ్చీ తన అనుమానం...

ఇతను (అదే తనని చూచును వెళ్ళినతను) తండ్రి గీసిన గీటు చస్తే దాటడట. మంచిదేమరి రేప్రొద్దుటివా ఇంచక్కా తన అదుపాజ్ఞల్లో ఉంచుకోవచ్చు. అయితే ఈవిషయంలో నట్టుకు తండ్రి "కానికట్నం" కోరే పక్షంలో...తన తండ్రికి ఇచ్చుకోగల స్తోమతు ఎక్కడుందీ...అతను చూడబోతే తండ్రిమాటకి జవదాటని రకమాయె...ఆ ఏమిటోలే...అన్నీ తన అనుమానాలేకాని...ఎంత మంది ఇటువంటివాళ్ళే...తీరా పెళ్ళివిషయంలో తండ్రిని వ్యతిరేకించడం లేదుకనుక?...

సిగరెట్లు సైతం కాల్చడట...ఎంతో గొప్పగా చెప్పాడకని తండ్రి...ఏమిటో మగవాళ్ళయి పుట్టిన తరువాత సిగరెట్లయినా కాల్చందే తనకంత బావుండదు. పెదవులు సున్నాల్లా చుట్టి బుగ్గలుబ్బిస్తూ పొగ బయటికి వదులుతూంటే ఇంచక్కా...చూడ ముచ్చటగా ఉంటుంది...మగతనానికది నిజంగా మెరుగులు పెడుతున్నట్లుంటుంది. పోనీలే దానిదేముంది...పెండ్లయినాక అంత కావాలను కుంటే| తనే పట్టుపట్టి కాల్పించవచ్చు...

ఇక పొరుగూరు కాలేజీలో చదువుతుండినా తండ్రి పంపే డబ్బుకు అణాపైసాలతో సహా ఖర్చు రాసిపంపుతుంటాడట...అది మంచిపనేలే...ఇక రేప్రొద్దుట పెండ్లి గనక అయితే (అవకేమాతుందిలే)...ఏ ఉద్యోగమో చేస్తూ ఏ నూరో నూట పాతికో తెస్తూ ..అణాపైసలతో సహా ఇక తనకే దక్కించుకుంటూ ఖర్చులెక్క చెబుతూంటాడు...అసలతను చెప్పేదేమిటి?...తనే చెవులూడేసి ..జీతం వచ్చిన వెంటనే తనే పుచ్చుకుని ఖర్చు పెడుతూ ఉండవచ్చు...పాపం...అతను కష్టపడి సంపాదిస్తాడు...తను దౌర్జన్యంగా అనుభవిస్తుంది. ఏమిటో...క్రితం క్షణంవరకు అతనెవరో...తనెవరో...పెండ్లి పేరుతో భార్యాభర్తలయిపోవడం...ఒకరికొకరు ఆత్మీయులు కావడం...ఒకరికొకరు అధికారులు కావడం...ఒకరికొకరు బానిసలు కావడం......

అంతాకలపి సంవత్సరం తిరగక ముందే......అప్పుడే పండంటి పాపాయిని చేతుల్లోఉంచుకుని జోలలుపాడటం...అతను గిలక్కాయలు అవీ చూపించి ఉయ్యాలతొట్లో ఏడుస్తున్న పిల్లవాడిని సముదాయించ బోయి... ...చివరికి చేతగాక వంటింట్లోఉన్న తనని పిలవడం...నవ్వుతూ వచ్చి తను...పాపాయిని ఒళ్లోకి తీసుకుని సిగ్గుపడుతూ...చెంగుతో పాపాయిముఖం కప్పివేయడల...ఛీ...ఏమిటో ...తలుచుకుంటూంటే తనకే సిగ్గుగా ఉంది.

అప్పుడే అతను భర్తయిపోయినట్లు...తనొక బిడ్డతల్లైపోయినట్లు అసలు తను ఇటువంటి ఆలోచనలు చేస్తున్నట్లు...తల్లికి తండ్రికి తెలిస్తే......ఛూ పాడుఏమనుకుంటారు?...

అసలు వాళ్ళేమన్నారో ముందు తెలియాలిగా...ఈపాటికి బండెక్కించేసి...ఏవిషయమూ తేల్చుకుని తండ్రి తిరిగొచ్చేస్తూ ఉండాలి...ఏమౌతుందో ఏమిటో?

ఎదరింటి సుబ్బలక్ష్మి వాళ్ళ ఇంటిముందరి కలకత్తా జామిచెట్టుమీదికి జంట చిలుకలు అప్పుడే రెపరెపలాడుతూవచ్చి వాలాయ్...అదేక్షణంలో ఉషాదేవి ఎడమకన్ను అదరటమూ మొదలుపెట్టింది...ఈలోపలే ప్రక్కవీధిలోని దేవాలయపు గంటల జయధ్వానమూ చెవులకిసోకింది...

అన్నీ శుభసూచనలే...

మరు క్షణంలోనే తండ్రి ఇంట్లో కాలుపెట్టిన అలికిడి—"ఏమైందండీ" అన్న తల్లి ప్రశ్నా వినిపించాయి.

వెను వెంటనే...తండ్రి తాలూకు ఒక పెద్ద నిట్టూర్పు...ఆటుపైన "మనకున్నదంతా కలిపినా వాళ్ళడిగినదానిలో సగానికైనా రాద"న్న తండ్రి సమాధానం సైతం వినిపించి...పువ్వులా వాలిపోయింది పాపం ఉషాదేవి.

★